నమస్తే తెలంగాణ
# కరీంనగర్
3 | కరీంనగర్, బుధవారం 5 జూన్ 2024 | KARIMNAGAR



కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

## కోరుట్ల బల్దియాకు పీసీబీ గ్రీన్ చాంపియన్ అవార్డు

కోరుట్ల, జూన్ 4: పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా చేపట్టిన పొడి వనరుల సేకరణ కేంద్రం నిర్వహణకు గానూ కోరుట్ల బల్దియాకు తెలంగాణ పీసీబీ గ్రీన్ చాంపియన్ అవార్డు దక్కింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్వే నిర్వహించింది. పర్యావరణానికి హాని కలుగకుండా ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు గాను తడి, పొడి చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేస్తున్న కృషికి గానూ కోరుట్ల బల్దియాను అవార్డుకు ఎంపిక చేసింది. పొడి చెత్త సేకరణ కోసం మున్సిపల్ శాఖ మెప్మా ఆధ్వర్యంలో స్థానిక రోజా మహిళా పొదుపు సంఘానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. ప్లాస్టిక్ వ్యర్థాలు, బీరు బాటిళ్లు, ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, రద్దీ పేపర్లను వేర్వేరుగా సేకరించి కిలోల చొప్పున విక్రయించేది. డంప్‌యార్డుకు తడి వ్యర్థాలు మాత్రమే తరలించడంతో అవి సులువుగా మట్టిలో కలిసిపోయేవి. అలాగే మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఇంటింటా తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సేకరణ వనరుల కేంద్రానికి విక్రయించడంతో ఒక్కో కార్మికుడికి రోజుకు సుమారు ₹200నుంచి ₹500 వరకు అదనపు ఆదాయం సమకూరుతున్నది. కోరుట్ల బల్దియాకు టీజీ పీసీబీ గ్రీన్ చాంపియన్ అవార్డు రావడంపై కమిషనర్ బట్టు తిరుపతి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు.

# బండి భారీ విజయం

- కరీంనగర్ పార్లమెంట్‌లో బీజేపీ అభ్యర్థి గెలుపు
- 2,25,209 ఓట్ల మెజార్టీ


బండి సంజయ్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూన్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) కరీంనగర్ (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో భారతీయ జనతాపార్టీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. లోక్‌సభ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీ సాధించిన ఎంపీగా ఆయన నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 17,97,150 మంది ఓటర్లు ఉండగా, అందులో 13,03,690 మంది గత నెల 13న తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంగళవారం నగరంలోని ఎ స్సారార్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. బీజేపీ అభ్యర్థి పోస్టల్ ఓట్లు కలుపుకొని 5,85,116 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు 3,59,907 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ 2,82,163 ఓట్లు పొందారు. నిజానికి 2006 లోక్‌సభ ఉప ఎన్నికల్లో కేసీఆర్ 2,01,581 ఓట్ల మెజార్టీతో గెలిచి రికార్డు సృష్టించారు. 2014 ఎన్నికల్లో బోయినపల్లి వినోద్‌కుమార్ 2,05,007 ఓట్ల మెజార్టీతో గెలిచి, కేసీఆర్ కన్నా ఎక్కువ మెజార్టీ సాధించారు. ప్రస్తుతం బండి వీరి ఇద్దరికన్నా ఎక్కువ 2,25,209 ఓట్ల మెజార్టీ సాధించిన ఎంపీగా నిలిచారు. సాయంత్రం సం జయ్ ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీలో ఎన్నికల అధికారి పమేలా సత్పతి నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

### ఇది ప్రజల విజయం

నిజానికి గత అసెంబ్లీ ఎన్నికల్లోనే బీజేపీ అధికారంలోకి రావాలి. కానీ, కాంగ్రెస్ ఆరు హామీలు ఇచ్చి గద్దెనెక్కింది. అయితే అవి అమలు చేయడంలో విఫలమైంది. ఆరు గ్యారెంటీల అమలు కోసం నేను ప్రజల పక్షాన పోరాటం చేస్త. అప్పుడు కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిన ప్రజలు, ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించేందుకే నన్ను గెలిపించిన్రని భావిస్తున్న. ఇది ప్రజల గెలుపే. నాపై విశ్వాసం ఉంచి అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించిన ప్రజలు, శ్రమించిన కార్యకర్తలకు నా విజయాన్ని అంకితం చేస్తున్న. ముచ్చటగా మూడోసారి మోడీ ప్రధాని అవుతున్నరు. గతంలో కన్నా ఎక్కువ కష్టపడి, నియోజవర్గానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్త. ప్రజలు మోడీ పాలనను విశ్వసిస్తున్నారని చెప్పడానికి మూడోసారి అధికారం ఇవ్వడమే నిదర్శనం. లోక్‌సభ నియోజకర్గం పరిధిలో నేను అందించిన సేవలు, బీజేపీ అధ్యక్షుడిగా నేను చేసిన పోరాటాలు, పేదల పక్షాన నిలిచిన విషయాలను గుర్తించిన ప్రజలు.. ఈభారీ మెజార్టీ ఇచ్చి గెలిపించిన్రు. ఈ గెలుపుతో నాపై మరింత బాధ్యత పెరిగింది.

**- గెలిచిన అనంతరం ఎస్సారార్ కళాశాల వద్ద మీడియాతో బండి సంజయ్**

### కనిపించిన మోడీ ప్రభావం

అందరూ అనుకున్నట్టుగానే ఉత్తర తెలంగాణపై మోడీ ప్రభావం ఈ ఎన్నికల్లోనూ స్పష్టంగా కనిపించింది. అందులోనూ కరీంనగర్‌లో మరింత ప్రస్ఫుటమైంది. మోడీ వేవ్ ఉందన్న అభిప్రాయాల నేపథ్యంలో దీనిని అందిపుచ్చుకోవడానికి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ తనదైన శైలిలో పావులు కదిపారు. అందులో భాగంగానే దేశానికి మోడీ అవసరమని, మీరు వేసే ప్రతి ఓటు మోడీకే వెళ్తుందంటూ ప్రచారం చేశారు. ఒక దశలో 'నా కోసం ఓటు వేయకండి.. మోడీ కోసం ఓటు వేయండి' అంటూ తన ప్రచారంలో పిలుపు నిచ్చారు. దీంతో పాటు అయోధ్య రామమందిర నిర్మాణం, ప్రారంభం వంటి అంశాలతోపాటు అక్షింతల పంపిణీ వంటి సెంటిమెంట్ అంశాలను తనకు అనువుగా మలుచు కోవడంలో బండి సంజయ్ సక్సెస్ అయ్యాడన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతోపాటు ఇతర పార్టీ అభ్యర్థుల కన్న ముందుగానే.. యాత్ర చేయడం.. ఆ యాత్రలో చేసిన సెంటిమెంట్ వ్యాఖ్యలు బండి సంజయ్‌కి కలిసి వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే 2019 లోక్‌సభ ఎన్నికల్లో 89,508 ఓట్ల మెజార్టీ సాధించిన బండి.. ఈసారి ఏకంగా 2,25,209 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బండి విజయంతో బీజేపీ నాయకులు సంబురాలు చేసుకుంటున్నారు.

# గడ్డం వంశీకృష్ణ గెలుపు

- పెద్దపల్లి పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం
- 1,31,364 ఓట్ల ఆధిక్యం


పెద్దపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి గెలుపు పత్రం అందుకుంటున్న గడ్డం వంశీకృష్ణ

### నిర్విరామంగా శ్రమిస్తా

పెద్దపల్లి ఎంపీగా నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన ఈ విజయం పూర్తిగా ప్రజలది. నా గెలుపు కోసం కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ఓటుతో నన్ను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు. మా తాత కాక వెంకటస్వామి, తండ్రి వివేక్‌ను గుర్తు పెట్టుకొని నన్ను దీవించిన ప్రజలందరికీ ధన్యవాదాలు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిర్విరామంగా శ్రమిస్తా. కష్ట పడుతా. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలందరి సహాయ, సహకారాలతో ఈ విజయం లభించింది. ఈ బాధ్యతను భుజాన ఎత్తుకొని గతంలో పని చేసిన ఎంపీలకు భిన్నంగా అభివృద్ధి చేస్తా. పోరాడి నిధులు తీసుకు వస్తా.

**- పెద్దపల్లి ఎంపీగా గెలుపొందిన గడ్డం వంశీకృష్ణ**

పెద్దపల్లి, జూన్ 4 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ఘన విజయం సాధించారు. 1,31,364 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 15,96,430 మంది ఓటర్లకు గాను 10,83,453 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం రామగిరి మండలం సెంటినరీకాలనీలోని మంథని జేఎన్‌టీయూహెచ్ కళాశాలలో పెద్దపల్లి, రామగుండం, మంథని, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్లను లెక్కించారు. అదే విధంగా చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్లను మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కళ్లలోని ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో లెక్కించారు. సాయంత్రం వరకు 21 రౌండ్లలో ఫలితం వెల్లడైంది. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు 4,75,587 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌కు 3,44,223 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 1,93,356 ఓట్లు వచ్చాయి. వంశీకృష్ణ బీజేపీ అభ్యర్థిపై 1,31,364 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కాగా, ఓట్ల లెక్కింపు తర్వాత సాయంత్రం మంథని జేఎన్‌టీయూహెచ్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ నుంచి గెలుపు పత్రాన్ని అందుకున్నారు.

### అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎప్పుడూ తృతీయ స్థానంలో నిలిచే బీజేపీ ఈసారి అనూహ్యంగా పుంజుకున్నది. దీంతో బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌కు అత్యధికంగా ఓట్లు 3,44,223 రాగా.. ద్వితీయ స్థానంలో నిలిచారు. లోక్‌సభ పరిధిలో గతంలో ఎప్పుడూ కూడా బీజేపీకి ప్రజల నుంచి పెద్దగా ఆదరణ కనిపించిన దాఖలాలు లేవు. కానీ, ఈ సారి దేశవ్యాప్తంగా అనుకూలమైన వాతావరణం ఉండడంతో పెద్దపల్లి నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి కనిపించింది. బీజేపీ అభ్యర్థి ప్రచారంలో కొంత వెనుకపడ్డప్పటికీ పార్టీకి మాత్రం అధికంగా ఓట్లు పోలయ్యాయి. ఇదే సమయంలో బీఆర్‌ఎస్ గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డింది. పార్లమెంట్ ఎన్నికలు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవి కావడంతో బీఆర్‌ఎస్ వెనుకపడింది. ఇదే విషయాన్ని బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు పదే పదే ప్రచారంలో ప్రస్తావించడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మూడో స్థానంలో నిలువాల్సి వచ్చింది.

# ప్రజాతీర్పును గౌరవిస్తాం

కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



రాంనగర్, జూన్ 4: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తామని కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. ఓట్ల లెక్కింపు తర్వాత మంగళవారం సాయంత్రం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యర్థిగా తనను ప్రకటించడంలో ఆలస్యం జరగడం, ప్రచారానికి కేవలం 15 రోజుల గడువు మాత్రమే ఉండడం వల్ల విజయం అందుకోలేక పోయామని చెప్పారు. అక్షింతలు పంచడం మొదలు అయోధ్య రామమందిరం లాంటి అంశాలతో సంవత్సరం క్రితం నుంచే బీజేపీ అభ్యర్థి రాజకీయ ప్రచారం చేయడం, ఇతర విషయాలు తన ఓటమికి కారణంగా మారాయని వివరించారు. తనను గెలిపించడం కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఎంతో శ్రమించారని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ రావడం సంతృప్తినిచ్చిందని, ఓటమి చెందినప్పటికీ ప్రజాతీర్పును గౌరవిస్తూ భవిష్యత్తులో జరగబోయే ప్రతి ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పురుమల్ల శ్రీనివాస్, ప్రణవ్ బాబు, ఆరెపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణగౌడ్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఎండీ తాజ్, బానోతు శ్రవణ్ నాయక్, పులి ఆంజనేయులు గౌడ్, పడాల రాహుల్, అబ్దుల్ రహమాన్, మల్యాల సుజిత్ కుమార్, కెడం లింగమూర్తి పాల్గొన్నారు.

# తుదిశ్వాస వరకూ సేవ చేస్తా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- గెలిచినా.. ఓడినా ప్రజాక్షేత్రంలోనే ఉంటా
- పొన్నం.. నోరు అదుపులో పెట్టుకో
- సంజయ్ ఇప్పటికైనా అభివృద్ధిపై దృష్టి సారించు
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- ఎంపీగా గెలిచిన సంజయ్‌కి శుభాకాంక్షలు

### పొన్నం నోటి దురుసు వద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్ నోరు అదుపులో పెట్టుకో. నోటి దురుసుతో ఏది పడితే మాట్లాడొద్దు. కరీంనగర్‌కు నా పీడ పోయిందని అనడం సరికాదు. నేను ఎంపీగా కరీంనగర్ అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు తెచ్చినందుకు పీడ విరుగడ అయ్యిందా? జిల్లా ప్రజల ఎన్నో ఏండ్ల కళ అయిన హైదరాబాద్‌కు రైల్వేను మంజూరు చేయించి, ప్రధాని మోడీతో శంకుస్థాపన చేయించినందుకు పీడ విరుగడ అయిందా? చెప్పాలి. ఎంపీగా నీవు ఏం చేసినవ్? కరీంనగర్ అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా తెచ్చినవా? ఒక మంత్రి స్థాయిలో ఉండి ఇలా మాట్లాడడం సరికాదు. అదృష్టం కొద్ది మంత్రి పదవి వచ్చింది. దానిని ప్రజల మంచి కోసం వినియోగించుకోవాలి. సమావేశాల్లో పక్కవారిని తొయ్యడం, కొట్టడం, నాపై వ్యక్తిగత విమర్శలు చేయడం ఏం పద్ధతి? ప్రజాప్రతినిధులు ప్రజల కోసం పని చేయాలి కానీ, ఇలా వ్యక్తిగత దూషణలు చేయద్దు. నేను 2001లో గులాబీ జెండా పట్టి, 14 ఏండ్లు ఉద్యమం చేసిన. నాపై ఇలా విమర్శలు చేయడం మానుకో.

**- వినోద్ కుమార్**

కార్పొరేషన్, జూన్ 4 : 'నేను కరీంనగర్‌లోనే పుట్టా.. గెలిచినా, ఓడినా ప్రజాక్షేత్రంలోనే ఉంటా. తుది శ్వాస వరకూ కరీంనగర్ ప్రజలకు సేవ చేస్తా' అని మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని.. నిత్యం ప్రజల కోసమే పనిచేస్తానని చెప్పారు. తన కోసం ఐదు నెలలుగా పని చేసిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు శుభాకాంక్షలు చెప్పారు. కరీంనగర్ భగత్‌నగర్‌లోని తన నివాసంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును, కేసీఆర్ పాలనను బేరీజు వేసుకొని తమకు పట్టం కడుతారన్న విశ్వాసం కనిపించిందన్నారు. కానీ, ఈ ఎన్నికలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయన్న ఆలోచనతోనే ప్రజలు కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు వేశారని తెలిపారు. ఢిల్లీలో మోదీ ఉండాలనే అభిప్రాయంతో తెలంగాణ ప్రజలందరూ ఓట్లు వేశారని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ముందు నుంచే బీజేపీ అయోధ్య రామాలయం, అక్షింతలను పంచి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుందని విమర్శించారు. రామాలయం కట్టిన అయోధ్యలోనే బీజేపీ ఓడిపోయిందని, ఈ విషయంలో తెలంగాణ ప్రజలు ఆలోచించాలని సూచించారు. ఉత్తరాదిన ఓటమి చెందుతున్నారని తెలియడంతోనే 400 సీట్లు గెలుస్తున్నామని ప్రధాని మోదీ దక్షిణాది రాష్ట్రాల్లో ఒక వేవ్ క్రియేట్ చేశారని చెప్పారు. మీడియా, సోషల్ మీడియాను గుప్పిట్లో పెట్టుకుని ప్రజల్లో తప్పుడు ప్రచారాలతో ఓట్లు దండుకున్నారని విమర్శించారు. బీజేపీకి 2019 ఎన్నికల కంటే ఇప్పుడు తక్కువ సీట్లు వచ్చాయన్నారు. ఇప్పుడు దీనికి మోడీ నైతిక బాధ్యత వహించాలన్నారు. ప్రజలకు కావాల్సింది అభివృద్ధి అని, ఇప్పటికైనా బండి సంజయ్ ప్రజా సమస్యలు, అభివృద్ధిపై పని చేయాలని హితవుపలికారు. సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్, నాయకులు చీటి రాజేందర్‌రావు, బాలకిషన్ రావు, ఆనంద్ పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో అర్వింద్

లక్షా తొమ్మిదివేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపు


ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అర్వింద్

నిజామాబాద్, జూన్ 4 : నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ రెండోసారి విజయం సాధించారు. 1.09 లక్షల ఓట్లకు పైగా మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు 4.76 లక్షల ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి 3.59 లక్షల ఓట్లతో రెండో స్థానంలో, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ 78,654 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఎన్నికల కౌంటింగ్‌ను డిచ్‌పల్లిలోని సీఎంసీలో మంగళవారం నిర్వహించారు. ఓటమి ఖరారు కావడంతో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి మధ్యలోనే కౌంటింగ్ సెంటర్ నుంచి వెళ్లిపోయారు. తన విజయంపై అర్వింద్ స్పందిస్తూ.. ఇది మోదీ విజయమని, పార్టీ కోసం కష్టపడిన యువత, మహిళలు, రైతులతోపాటు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఉపాధి కరువై.. అప్పు బరువై..

- దుబాయ్‌లో నిమ్మపల్లివాసి ఆత్మహత్య
- మృతదేహాన్ని తెప్పించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

కోనరావుపేట, జూన్ 4: ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి సరైన పనిలేక.. చేసిన అప్పు తీర్చే మార్గం లేక ఆందోళన చెందాడు. ఈ పరిస్థితుల్లో అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన విక్కుర్తి ఎల్లయ్య (48)కు భార్య రేణుక, కొడుకు రెహ్వాన్ (4) ఉన్నారు. గుంట భూమి లేకపోవడంతో ఆరేళ్లుగా గల్ఫ్ దేశం వెళ్తున్నాడు. ఆరు నెలల క్రితమే ఇంటికి వచ్చి, మళ్లీ కంపెనీ వీసాపై దుబాయ్ వెళ్లాడు. కానీ, అక్కడ సరైన పని లేకపోవడం, చేసిన పనికి జీతం తక్కువగా ఉండడంతో నిరాశ చెందాడు. మూడు రోజుల క్రితం భార్య రేణుకకు ఫోన్ చేసి.. ఇంటి వద్ద చేసిన ₹6 లక్షల అప్పు ఎలా తీర్చాలని బాధపడ్డాడు. భార్య అధైర్య పడొద్దని చెప్పినా.. ధైర్యంగా ఉండలేకపోయాడు. మంగళవారం స్నేహితులు పనికి వెళ్లిన తర్వాత రూంలోనే ఉరేసుకున్నాడు. స్నేహితులు పనికి వెళ్లొచ్చిన తర్వాత చూసి, ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. కడసారి చూపుకైనా ఎల్లయ్య మృతదేహాన్ని ఇంటికి తెప్పించాలని భార్య, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# గాలివాన బీభత్సం


ఓదెల: గుండ్లపల్లిలో లేచిపోయిన ఇంటి కప్పు రేకులు


సిరిసిల్లలో కురుస్తున్న వర్షం

రాజన్న సిరిసిల్ల జూన్ 4 (నమస్తే తెలంగాణ) కోల్‌సిటీ/ జూన్ 4 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులతో పలు చోట్ల భారీ వర్షం పడింది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో దాదాపు గంటపాటు పిడుగుల శబ్దాలతో భయానక వాతావరణం కనిపించింది. గోదావరిఖనిలోని స్థానిక పవర్‌హౌస్ కాలనీలో సింగరేణి క్వార్టర్(టీ2-213)పై భారీ వృక్షం పడడంతో ఇల్లు ధ్వంసమైంది. రామగుండంలో పలు చోట్ల వృక్షాలు నేలవాలడంతో విద్యుత్ లైన్లు తెగిపోయాయి. సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంటలో గాలిదుమారానికి పలువురి ఇండ్ల పైకప్పు, రేకులు కొట్టుకుపోయాయి. కొలనూర్‌లో కొంతసేపు రాళ్ల వాన పడింది. ఎన్టీపీసీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎన్టీపీసీ కాలనీలోని ఓదెల చంద్రమౌళికి చెందిన ఇంట్లోని మూడు గదుల రేకులు పూర్తిగా నేలమట్టం కాగా, ముప్పిడి రాజయ్య, ఓదెల రాయమల్లుకు చెందిన ఇంటి రేకులు విరిగిపోయాయి. రామగుండం పట్టణం ఆదర్శనగర్‌లో మాల మహానాడుకు చెందిన కమ్యూనిటీహాల్ రేకులు గాలిలోకి విరిగిపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో పశువుల పాక ముందు కట్టేసిన ఎద్దుపై చెట్టు పడి చనిపోయింది. మల్యాలలో కీర్తి వెంకటేశం రేకుల షెడ్డు ఈదురగాళ్లకు ఎగిరిపోయి సమీపంలోని పాఠశాల మైదానంలో పడిపోయింది. మర్రిగడ్డలో తాటి చెట్టు విరిగిపడి స్తంభాలపై పడడంతో గంట పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వీర్నపల్లి మండలం బాబాయిచెరువుతండాలో భూక్యా జగన్‌కు చెందిన గడ్డివాము పిడుగు పడింది. తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లోని సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంతంలో భారీ మర్రి చెట్టు నేలకూలింది. అలాగే సిరిసిల్లలో సుమారు గంటకుపైగా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాగా, జిల్లాలో ఒక్కసారి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతోపాటు భారీ వర్షం పడడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో సంబురంగా సాగుబాటుకు సమయాత్తం అవుతున్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571